ఇటుక బట్టీల్లో బాల్యం బుగ్గి

ఇటుక బట్టీలో పని చేస్తున్న బాలలు

నిర్మల జిల్లా దిలావర్‌పూర్ మండలం సాంగ్వి శివారులోని ఇట్టుక బట్టీలో ఒడిశా, మహారాష్ట్రకు చెందిన కార్మికులు పని చేస్తున్నారు.వారి పిల్లలను బడికి పంపించడం లేదు. పాఠశాల ఊరికి దూరంగా ఉండడం కారణమైతే స్థానికేతరులు కావడం మరో కారణం. ఇటుక బట్టీల్లో బాల్యం బుగ్గి అవుతోంది. ఇతర రాష్ట్రాల పిల్లలు చదువులు వదిలేసి తల్లిదండ్రుల వెంట వచ్చి పని చేస్తున్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలను ఏటా తనిఖీలు చేస్తున్న విద్యాశాఖ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు ఇటుక బట్టీల్లో పని చేసే పిల్లలను గుర్తించడం లేదు. -నిర్మల్ ఫోటోగ్రాఫర్

వాహనాల రద్దీతో నిలిచిన వాహనాలు

భక్తులకు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన కుళాయి నీరు

విఫలమైన ప్రభుత్వం..

బాసర, ఫిబ్రవరి 2 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ ఆలయంలో జరిగే ఉత్సవాలకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినప్పటికీ ఆచరణలో లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. క్యూలైన్లలో మంచి నీటికి బదులు కుళాయి నీటిని సరఫరా చేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా చిన్న పిల్లలకు పాలు, బిస్కెట్లను అందించలేదు. అక్షరాభ్యాస మండపంలో భక్తులు రద్దీ వల్ల ఇబ్బందులు వచ్చాయి. ప్రణాళిక ప్రకారం లేకపోవడంతో భక్తులు రద్దీలోనే అక్షరాభ్యాసం చేయించుకుని అసహనం వ్యక్తం చేశారు. వాహనాల రద్దీ పెరగడంతో కంట్రోల్ చేయలేక వాహనాల ట్రాఫిక్ ఏర్పడింది. దీంతో భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ దగ్గరుండి వాహనాల ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని తెలిసి కూడా ఏర్పాట్ల విషయంలో అధికారులు పకడ్బందీగా చేపట్టకపోవడంపై ప్రభుత్వ వైఫల్యమే అని పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇచ్చోడ, ఫిబ్రవరి 2: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామడ మండలం పులిమడుగు గ్రామానికి చెందిన మడావి రాజు(30) తన స్నేహితుడు తులసీరాంతో కలిసి బైక్‌పై ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అధికవేగంగా ప్రయాణిస్తున్న వారి బైక్ ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట వద్ద లారీని తప్పించబోయి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజు మృతి చెందాడు. మృతుడి అక్క శంకుతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

డీసీఎం వ్యాన్ బోల్తా

సోన్, ఫిబ్రవరి 2: నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్ వై జంక్షన్ వద్ద నిర్మించిన అండర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం డీసీఎం వ్యాన్ బోల్తా పడింది. నిర్మల్ నుంచి ఆర్మూర్ వెళ్లే క్రమంలో కడ్తాల్ వైజంక్షన్ వద్ద నేషనల్ హైవే ఎక్కే క్రమంలో బోల్తాపడడంతో గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అండర్ బ్రిడ్జి నిర్మించినప్పటి నుంచి ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

టీవీ చోరీ

ఎదులాపురం, ఫిబ్రవరి 2: ఆదిలాబాద్‌లోని ఫిల్టర్ బెడ్‌లో నివాసముంటున్న మహ్మద్ అజార్ ఇంట్లో దొంగలు 32 ఇంచుల టీవీని దొంగలించినట్లు ఎస్ఐ విష్ణుప్రకాశ్ తెలిపారు. ఈ నెల 1వ తేదీన అజార్ వాళ్ల చుట్టాల ఇంటికి వెళ్లి ఆదివారం తిరిగి వచ్చారు. ఇంట్లో ఉన్న టీవీని దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 2: ఉట్నూర్ మండలంలోని ఓడోని గ్రామానికి చెందిన సూరజ్, తేజష్, విక్రమ్ శనివారం రాత్రి 12 గంటల సమయంలో ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నారు. గుడిహత్నూర్ మండలంలోని మర్కాగూడ గ్రామానికి చెందిన ఆటో ఢీ కొనడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై వెళ్తున్న తేజష్ కాలు విరిగిపోయింది. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించి బాధితుడిని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. తేజష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో రిమ్స్ వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. ముత్నూర్ నుంచి కేస్లాపూర్ గ్రామం వరకు బీటీరోడ్డు గుంతలతో అధ్వానంగా మారడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని కేస్లాపూర్, ముత్నూర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ తీగలకు తగిలి ఒకరి మృతి

బోథ్, ఫిబ్రవరి 2: పంట రక్షణకు పశువులు రాకుండా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో చోటు చేసుకోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరత్వాడ గ్రామానికి చెందిన మెస్రం కృష్ణ(22) పిప్పల్‌ధరి గ్రామానికి చెందిర బండారి చంద్ర శేఖర్‌కు చెందిన పొలంలో కూలి పని చేస్తున్నాడు. ఉదయం కూలి పనికి వెళ్లాడు. శనగ పంట చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. వేరే పొలంలో పని చేస్తున్న కోవ జంగు ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెళ్లి చూసే సరికి అప్పటికే మృతి చెందాడు. తండ్రి మెస్రం యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కులం పేరుతో దూషించిన యువకుడు అరెస్ట్

ఎదులాపురం, ఫిబ్రవరి 2: కులం పేరుతో దూషించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. గత నెల 12వ తేదీన వివేకానంద యువజన మండల నిర్వాహకుడు బాల శంకర్ కృష్ణను మోచిగల్లీకి చెందిన సామల ప్రశాంత్ (34) కులం పేరుతో దూషించాడు. బాల శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఆగని చోరీలు

భైంసా, ఫిబ్రవరి 2 : నిర్మల్ జిల్లా భైంసాలో చోరీలు నిత్యకృత్యమయ్యాయి. ఆలయాలు, ఇళ్లు, దుకాణాల్లో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. శనివారం అర్ధరాత్రి భైంసా– నిర్మల్ రహదారిలో గల ఎస్‌బీఐ సమీపంలో ఓ ఆన్‌లైన్ డెలవరీ బ్రాంచ్ కార్యాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఉదయం క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. అలాగే పులేనగర్‌లో ఓ ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాత్రి 9 నుంచి వాహనాలకు అనుమతి లేదు

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 2: ఉట్నూర్ డివిజన్‌లోని కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాలకు అనుమతి లేదని ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర తెలిపారు. రాత్రి సమయంలో ప్రత్యామ్నాయంగా గుడిహత్నూర్, జైనూర్ గుండా వెళ్లే రహదారులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. స్థానిక వాహనాలకు మాత్రం అనుమతి ఇవ్వడం జరుగుతుందని, ఆధార్‌కార్డు, ఇతర ఆధారాలు చూపించాలని సూచించారు. సేస్ చార్జీలు స్థానికేతరలకు మినహాయింపు ఉండదని అన్నారు. అదేవిధంగా అత్యవసర వాహనాలు ఆర్టీసీ, అంబులెన్స్‌లకు మినహాయింపు ఉంటుందని తెలిపారు. వన్యప్రాణులను సంరక్షించుటకు చట్టాలను కఠినంగా అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు, వాహనదారులు సహకరించాలని కోరారు.

పెంబిలో ఎమ్మెల్యే పర్యటన

పెంబి, ఫిబ్రవరి 2: నిర్మల్ జిల్లా పెంబితో పాటు గుమ్మెనెంగ్లాపూర్, దొందారి, రాంనగర్, పస్పుల గ్రామాల్లో ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పర్యటించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గుమ్మెనెంగ్లాపూర్ గ్రామానికి రోడ్డు, త్రీఫేజ్, తాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. అలాగే పస్పుల వంతెనను నిర్మించాలని కోరారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

5న జాబ్‌మేళా

ఎదులాపురం, ఫిబ్రవరి 2 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 5వ తేదీన యూపీజీఆర్ఏడీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అతీక్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యాక్సిస్ బ్యాంక్, ముత్తూట్ ఫిన్‌కార్ప్ కంపెనీలలో ఉద్యోగావకాశాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

కుభీర్, ఫిబ్రవరి 2: సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి నిల్వలు పేరుకుపోవడంతో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి గంగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని పత్తి రైతులు గమనించి సహకరించాలని కోరారు.

రిమ్స్‌లోనే ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీకి మళ్లీ సీటు

ఎదులాపురం, ఫిబ్రవరి 2: నిర్మల్ జిల్లాలోని మామడ మండలం కొటికల్ గ్రామానికి చెందిన ఏలేటి శ్రీకర్ రెడ్డి ఆదిలాబాద్ రిమ్స్‌లో 2017 నుంచి 2023 వరకు ఎంబీబీఎస్ పూర్తి చేశారు. మళ్లీ 2024లో పీజీ జనరల్ మెడిసిన్ కూడా ఇక్కడే వచ్చింది. దీంతో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌ను ఆదివారం ఆయన చాంబర్‌లో కలిశారు. ఎంబీబీఎస్ పూర్తి చేసుకొని రిమ్స్‌లో పీజీ సీటు రావడం అదృష్టమన్నారు.

ఆర్జీయూకేటీలో ముగిసిన వర్క్‌షాప్

ముగింపు వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

బాసర, ఫిబ్రవరి 2 : నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో 'పవర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికిల్స్'పై మూడు రోజుల వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ వెహికల్స్ ఛార్జర్లు, డ్రైవ్ రైళ్లు, పవర్ కన్వర్టర్ టెక్నాలజీల గురించి విలువైన విషయాలను అందించారని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను నిర్వాహకులు అందించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు లక్ష్మణ్ ముత్యం, వినయ్‌కుమార్, హెచ్‌డీ భూక్యా భావసింగ్, ఎన్ రాకేశ్, ఓఎస్‌డీ మురళీదర్శన్, ఏవో రణధీర్‌సాగి పాల్గొన్నారు.

నకిలీ నోట్లు చలామని చేస్తున్న ఇద్దరి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 2 : నిర్మల్ జిల్లా కేంద్రంలో నకిలీ నోట్లను చలామణి చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ రాజేశ్ మీనా తెలిపారు. నిర్మల్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ ఆటోస్టాండ్ అడ్డా వద్ద కూరగాయలు అమ్ముకుంటున్న దొంగరి వంశీ వద్దకు తాండూర్ మండలంలోని బొండ్రత్ గ్రామానికి చెందిన షేక్ ఖదీర్ వచ్చాడు. రూ.140 కూరగాయలు కొనుగోలు చేసి రూ.500 నోటు అందించాడు. ఆ నోటు తేడాగా అనిపించడంతో వేరేది ఇవ్వమని అడుగగా అతనితో గొడవకు దిగాడు. పెట్రోలింగ్ చేస్తున్న ఎస్ఐ అశోక్ అక్కడికి చేరుకుని గొడవను సర్దుమనిగించి ఆ నోటును పరిశీలించగా అది నకిలీ అని తేలింది. అతడిని పట్టుకుని విచారించగా తనతోపాటు బస్టాండ్ వద్ద ఇంకో వ్యక్తి వద్ద కూడా నకిలీ నోట్లు ఉన్నాయని తెలిపాడు. అతని వద్ద ఉన్న 40 నోట్లను జప్తి చేసుకుని ఇతనిలో ఉన్న ఇంకో వ్యక్తి సురేశ్ అని అతడిని తనిఖీ చేయగా 43 నోట్లు లభ్యమయ్యాయి. వీరిని విచారించగా మహారాష్ట్రలోని పర్బని తాలూకా పోకర్ని గ్రామానికి చెందిన సందీప్ వద్ద కొనుక్కుని వచ్చామని తెలిపారు. వీరి వద్ద ఉన్న నకిలీ నోట్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పెంబి, ఫిబ్రవరి 2: నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని తాటిగూడ గ్రామానికి చెందిన కడవాత్ గోవింద్, మండల కేంద్రానికి జోగు నరేందర్ అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మల్లేశ్, మహేందర్ ఉన్నారు.

ఖానాపూర్, ఫిబ్రవరి 2 : ఖానాపూర్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన బోనగిరి సునీత, కతులపురం సాయిచంద్ మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రాజు, సుమీత్, ప్రదీప్ ఉన్నారు.

పెంబి: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జాన్సన్ నాయక్

ఎన్‌సీడీ క్లినిక్‌ను ప్రారంభించిన కలెక్టర్

ఎన్‌సీడీ క్లినిక్‌లోని రిజిస్టర్‌లో ఉన్న పేర్లను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఫిబ్రవరి 2 : ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో ఆదివారం ఎన్‌సీడీ క్లినిక్‌ను కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. అనంతరం రోగులను పరీక్షించే గది, వ్యాధిగ్రస్తులకు సేవలు అందించే గదులను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్‌సీడీ క్లినిక్‌లో బీపీ, మధుమేహం, క్యాన్సర్ వంటి వాటితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఉచితంగా మందులు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్, ఎన్‌సీడీ జిల్లా కార్యక్రమ అధికారి శ్రీధర్, రిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ అశోక్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ గజానన్, డీటీసీవో డాక్టర్ సుమలత పాల్గొన్నారు.

ఆలయంలో మాజీ మంత్రి ప్రత్యేక పూజలు

బేల, ఫిబ్రవరి 2: బేల మండలంలోని శివాలయంలోని శివలింగంపై పాము ఆకారంతో తయారు చేసిన కిరీటన్నీ ఆదివారం ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయ వార్షికోత్సవానికి మాజీ మంత్రి జోగు రామన్న హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజయ్, ప్రమోద్ రెడ్డి, గంభీర్, సతీశ్ పవార్, దేవన్న, శివ భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ఇచ్చోడ, ఫిబ్రవరి 2: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని విఠలేశ్వర ఆలయం వద్ద వసంత పంచమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కోసం ఆలయ కమిటీ సభ్యులు కలిసి నిర్మిస్తున్న కల్యాణ మండప నిర్మాణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శివారెడ్డి, గాడ్గే సుభాష్, మాజీ సర్పంచ్‌లు పాండురంగ్, నంద కిశోర్, సుభాష్, శ్రీహరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబేదార్ రాంజీ మాలోజీ సక్పాల్ స్మృతి దినం

ఎదులాపురం, ఫిబ్రవరి 2 : ఆదిలాబాద్ కైలాస్‌నగర్‌లోని అశోక బుద్ధ విహార్‌లో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తండ్రి సుబేదార్ రాంజీ మాలోజీ సక్పాల్ స్మృతి 112వ దినాన్ని నిర్వహించారు. గౌతమ బుద్ధుడు విగ్రహానికి అలాగే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, సుబేదార్ రాంజీ సత్పాల్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞా కుమార్, భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు విఠల్ ముక్టే, కాంతారావు వాగుమారే, రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దైవశీల హుక్కే, పుష్ప జాడే, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉజ్వల దూడే, ఉపాధ్యక్షురాలు నీలుబాయి వాఠోరే, సమతా సైనిక్ దళ్ జిల్లా సంఘటక్ రమాకాంత్ కాంబ్లే పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్స్‌కు తీవ్ర అన్యాయం

భైంసా, ఫిబ్రవరి 2 : కేంద్ర బడ్జెట్‌లో స్కీమ్ వర్కర్స్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని సీఐటీయూ జిల్లా నాయకుడు పోశెట్టి అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా భైంసాలో స్కీమ్ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ, మిడ్డి మిల్స్ వంటి విధుల్లో సేవలందించే స్కీమ్ వర్కర్ల హక్కులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. అంతేగాకుండా సంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, భద్రత కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమ నిధులను గణనీయంగా తగ్గించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణ దాస్, గంగామణి, రాందాస్, భీంరావ్ పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి

అభివాదం చేస్తున్న నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 2: యాదవ సంఘం బలోపేతానికి జిల్లా కార్యవర్గం కృషి చేయాలని సినీ నిర్మాత డాక్టర్ రవి కిరణ్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని జిల్లా యాదవ సంఘ భవనంలో అధ్యక్షుడు కాడిగిరి రఘువీర్ అధ్యక్షతన నిర్వహించిన ఎగ్జికూటివ్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. యాదవ సంఘం జిల్లా బాధ్యులు కాసవేణి నారాయణ యాదవ్, భీమన్న యాదవ్, పండరి యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా హన్మాండ్లు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మంచాల పెద్దమల్లయ్య యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఇది వరకు జిల్లా అధ్యక్షుడిగా సేవలు అందించిన కాడిగిరి రఘువీర యాదవ్‌ను శాశ్వత ఆహ్వాన అధ్యక్షుడిగా ప్రకటించారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం గౌరవాధ్యక్షుడు నారాయణ యాదవ్, కృష్ణ మీనన్, సుధాకర్ యాదవ్, ప్రకాశ్ యాదవ్, గణేశ్ యాదవ్, వెంకట్ యాదవ్, ఆశన్న యాదవ్, ప్రపుల్ యాదవ్, రమేశ్ యాదవ్, వెంకటరమణ, సురేందర్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, రవికాంత్ యాదవ్ పాల్గొన్నారు.

నాగోబా ఆలయానికి విరాళం అందజేత



చెమ్మెలు అందజేస్తున్న వైద్యులు స్వప్న–శశికాంత్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 2: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా ఆలయానికి నిర్మల్‌కు చెందిన ప్రముఖ వైద్యులు స్వప్న–శశికాంత్ దంపతులు ఆదివారం రూ.40 వేల విలువ చేసే దీపాలను ఆలయానికి అందజేశారు. ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వీరిని ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు.

మడివాలు మాచయ్య జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న ఆర్ఈడబ్ల్యూఏటీ నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 2 : ఆదిలాబాద్‌లోని బీసీ భవన్ కార్యాలయంలో రజక ఉద్యోగుల సంక్షేమ ఐక్య సంఘం తెలంగాణ(ఆర్ఈడబ్ల్యూఏటీ) ఆధ్వర్యంలో ఆదివారం రజక జాతి మూలపురుషుడు మడివాలు మాచయ్య జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఈడబ్ల్యూఏటీ గౌరవాధ్యక్షుడు అరుగుల స్వామి, అధ్యక్షుడు ముస్కు స్వామి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, బీసీ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు అశోక్, మంద శ్రీను, జక్కుల శ్రీను, నర్సింహులు, రాజు, ఆనందరావ్, సంతోష్, వినోద్, సోమేశ్ పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గానికి సన్మానం

నార్నూర్, ఫిబ్రవరి 2 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడలోని హీరాసుక్క మందిర ఆలయంలో పర్దాన్ సమాజ్ నూతన జిల్లా కార్యవర్గానికి ఆదివారం సన్మాన సభ నిర్వహించారు. పర్దాన్ సమాజ్ పెద్దల ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఉయిక సుదర్శన్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెస్రం మనోహర్, గౌరవాధ్యక్షుడు ఆత్రం అనుసూయ, ఉపాధ్యక్షుడు సెడ్మాకి సుభాష్, ఉపాధ్యక్షురాలు గంగసాగర్, సలహాదారుడు పూసం ఆనంద్‌రావ్, కార్యవర్గ సభ్యుడు మడావి శంకర్, కోశాధికారి మడావి దిగంబర్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆత్రం వామన్, కోశాధికారి పరశురాం, సంయుక్త కార్యదర్శి భరత్, గంగారాం, సిడాం వామన్, శ్యాంరావ్ పాల్గొన్నారు.

ఆలయాన్ని పరిశీలించిన ఎస్పీ

ఆలయంలో శాంతిభద్రతల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

బాసర, ఫిబ్రవరి 2 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ ఆలయాన్ని ఆదివారం ఎస్పీ జానకీ షర్మిల పరిశీలించారు. సోమవారం నిర్వహించే వసంత పంచమి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున శాంతిభద్రతల పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. ఆమె వెంట ఏఎస్పీలు రాజేశ్‌మీనా, అవినాశ్‌కుమార్, సీఐ మల్లేశ్, ఎస్ఐ గణేశ్, పోలీసులు ఉన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

క్రీడలను ప్రారంభిస్తున్న నాయకులు

తలమడుగు, ఫిబ్రవరి 2: క్రీడలతోనే మానసికోల్లాసం కల్గుతుందని బీఆర్ఎస్ యువ నాయకుడు పిడుగు అభిరాంరెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగులోని వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి, ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, క్రికెట్ దాతలు హరీశ్ రెడ్డి, తిరుపతి, రవీందర్, రవికాంత్, వెంకటేశ్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 2: నాగోబా జాతర సందర్భంగా పోలీస్, ఐటీడీఏ శాఖ, నాగోబా యూత్ ఆధ్వర్యంలో జనవరి 28న ప్రారంభమైన కబడ్డీ, వాలీబాల్ పోటీలు